శ్రీ రమణీయ రామాయణము.

CHECKED - 1963

ఆదిపూడి, సోమనాథరావు.

విన్నపము.

ఏమహానుభావుల చరిత్రను మనమనుసరించినయెడలఁ బాపసముద్రమునుండి తరింపఁగలమో యట్టివారికి నవతారపురుషులనిపేరు. హిందువులకు శ్రీరామచంద్రుఁడు అవతారపురుషులలో ముఖ్యుఁడు. శ్రీరాముఁడు మనజాతిజీవితమునందంతటను దాండవమాడుచున్నాఁడు. సుఖములో శ్రీరాముఁడు దుఃఖములో శ్రీరాముఁడు ఆఁటలలో శ్రీరాముఁడు పాటలలో శ్రీరాముఁడు స్త్రీలలో శ్రీరాముఁడు పురుషులలో శ్రీరాముఁడు తందానపాటలలో శ్రీరాముఁడు త్యాగరాజకృతులలో శ్రీరాముఁడు. ఇంతసరళమైననామము ఇంతమృదువైననామము ఇంతమధురమైననామము మఱియొకటిలేదు. శ్రీరామునివిషయమై కొంచెమైనను వర్ణింపకుండు కవియే మనలో లేఁడు. ఇంతమనోహరమైన చరిత్రలోఁ గొన్ని యసంభవములును గొన్ని కళంకములునుండుట గొప్పలోపమని తలంచి నాకు నసంభవములనియుఁ గళంకములనియుఁ దోఁచినవానిని సవరించి యందఱకుఁ బూర్ణాదర్శకముగ నుండవలయునను సదుద్దేశముతో శ్రీరామచరిత్రను హరికథారూపముగ వ్రాసి కోరినవారికెల్ల మనఃపూర్వకముగ వినిపించుచుంటిని. ఈనాప్రదర్శనమును జూచువారికి నెంతో మనోహరముగానుండినను, నా శరీరమునకును బుద్ధికిని నపరిమితమైనకష్టములు కలుగుచుండెను. ప్రస్తుతపు నాశరీరదౌర్బల్యమును గురుతించిన నామిత్రులలోఁ బలువురు దీనిని గ్రంథరూపముగ నచ్చొత్తింపవలయునని కోరుచువచ్చిరి. నాయార్థికస్థితి దీనికిఁ బ్రతికూలముగా నుండెను. ఇట్టిస్థితిలో నేను హైదరాబాదునకు వచ్చుటతటస్థిం

చెను. అప్పుడు నామిత్రులగు శ్రీ యస్, శ్యామరావుగారిమూలమున నేను దోమకొండ సంస్థానాధీశులగు శ్రీరాజా సోమేశ్వరరావు బహద్దర్ గారిని దర్శించి నా యీ రమణీయరామాయణమును గొంతచదివి వినిపించి దీనిని శ్రీవారికి సంకితమీయఁదలంచితినని ప్రస్తావించితిని. శ్రీవారు సంతసించి సమ్మతించి నన్నుఁదగినట్లుసత్కరించి తామీగ్రంథమును గద్వాలలో ముద్రించి 400 ప్రతులు నాకుదయచేయించునట్లును రెండవ కూర్పునుండి దీనిముద్రణాధికారము నాకేయుండుననియు సెలవిచ్చి నన్నెంతయో యాదరించిరి. నాగ్రంథము వెలుతురునుజూడఁగలిగెనుగదాయని యెంతయో సంతసించి శ్రీ రాజా గారికి నాకృతజ్ఞతాపూర్వక వందనముల సమర్పించితిని.

శ్రీ రాజా గారికిని వారికుటుంబమునకును బరమేశ్వరుఁడు సమస్తశుభములను బ్రసాదించునుగాక. ఆంధ్రులందఱు దీనిని దగినట్లాదరింతురుగాత.

ఆదిపూడి, సోమనాథరావు.

15-2-1930

ఓమ్.

అంకితము.

సీ॥ శ్రీ జేండ్లకులమను ♦ క్షీరవారాశిలో
జన్మించి వర్ధిల్లు ♦ చంద్రనీకు
దోమకొండకు మహా ♦ సీమ గద్వాలకు
నూంతగానొప్పెడు ♦ నేతనీకు
విద్వాంసులనుమతి ♦ విమలవర్తనులను
మన్నించుచుండెడు ♦ మాన్యనీకు
వివిధభాషలయందు ♦ విజ్ఞానమునుగల్గి
తనరారుచుండెడు ♦ ధన్యనీకు

గీ॥ నవ్యరమణీయ రామాయ ♦ ణమ్ముదీని
నంకితంబిత్తుఁ గొనుము వి ♦ ఖ్యాతిఁగనుము
శుద్ధచారిత్ర! సత్కవి ♦ స్తోత్రపాత్ర!
ఆప్తసురభూజ! సోమేశ్వ ♦ రాఖ్యరాజ!

శ్రీ

రమణీయ రామాయణము.

శా॥ శ్రీరమ్యామల శిష్టపాలనకళా ◆ శీలా! కృపాసాగరా!
తారార్కేందు సమస్త మండలవిభా ◆ ధారా! త్రిలోకేశ్వరా!
శ్రీరామాధిపువంటి నీతిచతురుల్ ◆ శ్రీకీర్తి విద్యాధరుల్
శూరుల్ ధర్మవిహారుఁ జేయుము సదా ◆ సోమేశ్వరుల్ భూవరుల్ -

కం॥ నవరసభావ విభూషిత
కవితల్ రామాయణమ్ముఁ ◆ గర్ణామృతముల్
భవహరమును వినిపించెదఁ
బ్రవిమల సోమేశ్వరాఖ్య! ◆ ప్రభువర! వినుమా.

కథా ప్రారంభము.

(అయోధ్య — సభా వర్ణనము)

సింహాసనాసీనుఁడై నిండుకొలువుండి సభాసదులఁ గనుంగొని

దశరథమహారాజు:—

సీ॥ వివిధవిద్యలనెల్ల ♦ విమల విశ్వామిత్రు
ఘనగురుకులమునఁ ♦ గాంచినాఁడు
పసిపాపలనుజంపు ♦ నసురఁదాటకఁజంపి
సేమమ్ముఁ బ్రజలకుఁ ♦ జేసినాఁడు
బలమైన శివువిల్లు ♦ భగ్నంబుఁ గావించి
బాహుబలంబునఁ ♦ బ్రబలినాఁడు
రాజుల స్రుక్కించు ♦ రాజసంబున నిక్కు-
పరశురాముని భంగ ♦ పఱచినాఁడు

గీ॥ అట్టినాసుతు శ్రీరాము ♦ నమలచరితుఁ
దవిలి యువరాజుగాఁజేయఁ ♦ దలఁచినాఁడ
మీకు నభిమతమేయిది ♦ మిత్రులార!
మంత్రివరులార! ప్రజలార! మాన్యులార! .

పరమానంద సంభరిత హృదయారవిందులై ప్రజలందఱు:—

శంకరాభరణము — ఆదితాళము.

ధన్యులౌదుమో నృపా! దశరథావనీపా!
పుణ్యమే రూపుదాల్చి ♦ పుడమియందుఁ బుట్టెననఁగ
మాన్యుఁడౌ శ్రీరామచంద్రు ♦ మాకుదొరగఁజేసిన ॥ ధ ॥
రవికులాబ్ధిపూర్ణచంద్రు ♦ రామచంద్రు సుగుణసాంద్రు
నవనిపా! యువరాజుఁ జేసిన ♦ నబ్బుఁగాదె నోముపంట ॥ ధ ॥

పరమోత్సాహముతో పురోహితులగు వసిష్ఠులు:—

చ॥ దశరథరాజ! చేసె మన ♦ దాశరథిన్ గరుణాత్ము సత్కళా
కుశలుని యౌవరాజ్యమునఁ ♦ గొంకక పట్టముఁగట్టు, దానఁ నీ
యశముఁవిశేషమై మెఱయు♦నర్కకులంబును వన్నెకెక్కెడున్
వశమగుసర్వసౌఖ్యములు ♦ వర్ధిలుసేమము భూప్రజాళికిన్ ॥

ఆనందాశ్రువుల రాల్చుచు మంత్రినిజూచి దశరథమహారాజు:—

కాఫి రాగము — రూపకతాళము.

రామచంద్రుఁడు చేపుప్రొద్దున ♦ రాజ్యభారముఁ బూనెడున్
ఏమిటన్ గొదలేకయుండఁగ ♦ నేర్పరింపు సమస్తమున్
ప్రేమమీఱ సుమంత్ర! వీడలఁ ! ప్రీతులను గావింపుమా
యీమహోత్సవమెల్లప్రజలకు ♦ నిష్టమై విలసిల్లగాన్.

[కైకేయి యంతఃపురము.]

శ్రీరామ పట్టాభిషేకమునకుఁ దనయంతఃపురము నలంకరింపుచున్న కైకేయి తనదాసియగు మంథరతో:—

కాంభోజి రాగము — రూపకతాళము.

మంథరా! చేపెపేడుక మన పురంబున
నందతేనగరవాసులా ♦ నందమొందఁగ ॥ 1 ॥
రామచంద్రుఁడు పట్టభద్రుఁడై ♦ రమణతోఁ జేపె
కామిని! నాకాళ్ల కెరగుఁ ♦ గనులపండువుగ ॥ 2 ॥

ఇంతకంటె హర్షముమున ♦ కేమిగల్గునే
అంతఃపుర మలంకరింతును ♦ వింతవింతగ ॥ 3 ॥
బీదసాదల కెల్లదానముల్ ♦ ప్రీతిఁగావింతు
ఆదరించి సేవకులకు ♦ మోదమిడెదను. ॥ 4 ॥

మంథర దైన్యముతో:—

చ॥ సవతి కుమారునింగొలిచి ♦ సౌఖ్యమునందినవారిఁ గాన నీ
కువలయమందు శేలవయి ♦ కొమ్మరో! పొంగెదు పొంగు
(క్రుంగెదుగా)
బ్రవిమలునీసుతుఁగా భరతుఁ ♦ బ్రాణముదీసినమేలుగాదెయి
ట్లవమతి చేయుకంటె సతి ♦ వా!మతిఁబాసి యిదేమిచేసితే.

మంథరమాట లక్ష్యపెట్టక కైక సంతోషముతో:—

సురట రాగము — రూపకము.

రాము నెఱుఁగవే సుగుణో ♦ ద్దాము నెఱుఁగవే
ప్రేమ భరతు మీఱునతఁడు ♦ పేలవముగఁ జూడఁడెపుడు
ఏమిటఁగొదఁ జేయఁడతఁడు ♦ ఎంతో మర్యాద పరుఁడు ॥రా॥

మంథర మొగము చిట్లించి కైకను జూచి:—

కం॥ దొరతనముఁ గోరువారిటు
చరియింతురు గానియవలఁ ♦ జర్యలు వేఱౌ
తరళాక్షి! నీకుఁ దెలియఁగఁ
బరమా! మున్ముందుఁ దెలిసి ♦ తలఁచెదవు సుమా.

కైక భయపడుచు:—

కాంభోజి — రూపక తాళము.

మంథరా! యేమిగతి? ముందెనాకుఁ దెల్పవైతి
మందమతినై మోసపోతి ♦ ముందునాకేమిగతి. ॥మం

మంథర కైక నోదార్చుచు:—

ఉ॥ మిక్కిలి ప్రేమఁ జూచు నను ♦ మేదినినాథుఁ డటంచుఁ బల్కెదు
నిక్కెదు నాటికయ్యమునఁ ♦ నెయ్యముఁ జూపినదానిఁ దెల్పనీ
వొక్కవరానఁ గానలకు ♦ నొక్కట రామునిఁ బంపఁ గోరవే
అక్కవరాన నీసుతున ♦ యోధ్యకుఁ బట్టముగట్టఁ గోరుమా.

అని యుపదేశించి కైక నుండి బహుమానముఁ గొని మంథర వెల్లిపోవును. కైక యొక మూలలోఁ గోపము వచ్చిన దానివలె మాసిన చీర గట్టుకొని చెఱఁగు పఱచుకొని పరుండియుండగా దశరథుఁడు చూచి కైకతో:—

శంకరాభరణము — రూపక తాళము.

కోపమేలనె ప్రియా! - నాపయిసకియా
ఈపురి ప్రజలెంతో - యింపుతో వెలయ ॥ 1 ॥
చెఱఁగు పఱచినేలఁ - జెలి! పండనేల
అఱచేయి దిండుగా - నమరి యాలీల ॥ 2 ॥
తలయెత్తి కనువిచ్చి - కలికి! కనుగొనుము
అలయింపఁ బోకుము - అలగి నామనము ॥ 3 ॥

కైక కన్నులునులుముకొనుచు శోకకోపంబులసూచించుచు:—

క॥ ఆనాఁడు యుద్ధమందున
నేనొసఁగిన యట్టిసాయ ♦ మెల్ల మఱచితొ
మానవనాథశిరోమణి!
మానము గాచినదిమఱచు ♦ మనుజుఁడుగలఁడే.

కైక నూరడించుచు దశరథుఁడు:—

బేగడ రాగము — రూపక తాళము.

కలికి!కోరినదిచ్చెద - కలఁగి యలుగకు - కలికి!కోరినదిచ్చెద
కలకంఠి! నీయుప - కారము మఱువనే ॥ కలికి ॥
చెలి! రథమును నడిపి - తెలిపిరిపుతంత్రము
సలిపి సాహాయ్యము - గెలుపు గల్గించితివి ॥ కలికి ॥

కైక సంతోషముతో:—

క॥ పదునాలుగేండ్లు వనమున
వదలక రాముఁడు వసింపఁ ♦ బంపుము, భరతుఁ
బదపడిఁ బట్టము గట్టుము
ముదమున నయోధ్యకుఁ బ్ర ♦ మోదంబెసఁగఁ.

దశరథుఁడు దుఃఖాక్రాంత చిత్తుండయి:—

నాథనామక్రియ — రూపక తాళము.

నామనోబ్ధిసోము సుగుణో - ద్దామ రాముని ప్రేమధా
ముఁ బాపనేల ‖ 1 ‖
భరతు రాజ్యనిరతుఁజేయు - వరము చాలక
వరకుమారు వనముఁబంపు - వరమదేలిఁక ‖ 2 ‖
కైక నీవు కపటివని - నాకుఁ దెలియక
నీకు వరంబొసంగి చెడితి - నిజమెఱుంగక. ‖ 3 ‖

శా‖ పాపీ!రామునిసర్వలక్షణయుతుఁ ♦ బ్రాణప్రియుం బాపిన
న్నేవం నావిధిసంపవచ్చితివిగా ♦ యీపాపముం దాల్చిసం
తాపంబేగతినోర్తురామ!సుగుణో♦ద్దామా! దయాసారమా!
నీపూర్ణేందుముఖమ్ముఁజూపఁగదరా♦ నేత్రాణముల్ పోసెదన్

అని మూర్ఛిల్లును:—

(సభా భవనము.)

పట్టాభిషిక్తుఁడగుటకు సర్వాలంకార శోభితుఁడై సీతా సౌమి
త్రులతోనే తెంచిన శ్రీరామునిఁజూచి వసిష్ఠుఁడు దైన్యముతో-

క‖ కైకేయిదేవినగరున
సాకేతపురీశ్వరుండు ♦ జాగొనరించెన్
నీకుంగనుఁగొనిరాఁదగు
నేకాంతమునుండురాజు ♦ నేనెటు గాంతున్.

కైకేయి యంతఃపురము.)

మూర్ఛిల్లిన దశరథమహారాజునుజూచి చింతిల్లుచుఁ గైకను సమీపించి నమస్కరించి వినయముతో శ్రీరామచంద్రుఁడు:—

శంకరాభరణము — రూపకతాళము.

జనకుఁడిటు లుండుటకుఁ గత మేమి? - జననీ! తెల్పవే
జనకుఁడిటు లుండుటకుఁ గత మేమి
దినకరాన్వయ పార్థివేంద్రుఁడు - దీనుఁడై యిటు దెల్విబా
యుచు ॥ జన ॥

తనయులుండఁగఁ - దండ్రికిది యేమి
వినెనఁ దెల్పుము - విశదముగనీ - మనమునందలి మాట
లెల్లను ॥ జన ॥

కైక నిర్లక్ష్యముతో:—

గీ॥ మున్ను వాగ్దాన మొనరించి ♦ యున్న రెండు
వరములనుబట్టి పదునాల్గు ♦ వత్సరములు
వనికి నినుఁబంపి భరతునిఁ ♦ బ్రభునిఁజేయు
మనిన మూర్ఛిల్లెఁదనపుట్టి ♦ మునిఁగినట్లు,

శ్రీరాముఁడు ధైర్యముతోను వినయముతోను:—

క॥ జనకుని వాక్యము సల్పఁగ
జననీ! వనమునకుఁబోదు ♦ సంతోషముతో

లక్ష్మణుఁడు కోపారుణిత లోచనుఁడై:—

ఉ॥ అన్న! యిదేమి వెఱ్ఱివయి ♦ యప్పుడె కానల కేగఁ జూచెదా
మెన్నఁడు సూర్యవంశమున ♦ నీవిపరీతము గల్గెఁ జెప్పుమా
యన్నను మీఱి తమ్ముఁ డెటు ♦ లందును రాజ్యమునిన్ను నేఁడు నేఁ
దిన్నఁగ రాజ్యమందునిచి ♦ తీరెదఁ జూ పెదమత్ప్రతాపముల్

అని యొరనుండి కత్తినిదూసి కైకనుచుఱచుటఁ జూచుచున్నాఁడుఁ శ్రీరాముఁడు సౌమిత్రి వెన్నుఁదట్టి యూరడించుచు:—

క॥ జనకుని వాక్యము కంటెను
ఘనమేమన కేఁ ప్రభుత్వ ♦ గౌరవమనుజా!.

గీ॥ మనకునై పుత్ర కామేష్టి ♦ మహినొనర్చి
కాంచిమనయాట పాటలఁ ♦ గడుఁజెలంగి
పెంచివిద్యల బుద్ధిఁజె ♦ ప్పించినట్టి
తండ్రి రెండవదైవమై ♦ తనరుఁగాదె
యతనిఋణమును దీర్పశ ♦ క్యమ్మె మనకు.

లక్ష్మణుఁడు ఉపకమిల్లి శ్రీరామునకు నమస్కరించి:—

గీ॥ అన్న! నాబొందిలోఁ బ్రాణ ♦ మున్నవఱకు
నిచటనే కాదు శ్రీరామ! ♦ యెచటనైన
మీపదమ్ములఁ గొలుచుచు ♦ మెలఁగువాఁడ
విడచిపోయినఁ బ్రాణముల్ ♦ విడుచువాఁడ.

ద్విపద॥ హారామ! యిదియేమి ♦ యవతారమయ్య!
భేరీమృదంగముల్ ♦ ప్రీతిమ్రోయంగఁ
దేరెక్కివచ్చిన ♦ దీవెనలిచ్చి
చేరి కౌఁగిటఁజేర్చి ♦ చెలఁగుదుననుచు
నుండఁగానారామ! ♦ యోగివేషమున
గుండె జల్లనవచ్చు ♦ గోడిదియేమి?

శ్రీరాముఁడు చేతులు జోడించి:—

గీ॥ మున్నువాగ్దాన మొనరించి ♦ యున్న రెండు
వరములనుబట్టి పదునాల్గు ♦ వత్సరములు
వనికిననుఁబంప భరతునిఁ ♦ బ్రభునిఁజేయ
జనకునింగోరెఁ గైకమ్మ ♦ చనెదవనికి.

కౌసల్య:—

గీ॥ రామ! నినుఁబాసి నేనెట్లు ♦ బ్రదుకఁగలను
కైక! నీకేల పెడబుద్ధి ♦ గలిగెనమ్మ!
అకట! ననుదుఃఖపెట్టెడి ♦ దొకటిదక్క
రాముఁడడవికిఁబోవ నీ ♦ కేమివచ్చు.

శ్రీరాముఁడు:—

గీ॥ వీరమాతవుఁ దగునెయో ♦ విన్నదనము
తండ్రివాక్యము నెఱవేర్చు ♦ తనయుఁజూచి

తల్లిముదమందవలెఁగాని ♦ తల్లడిలుట
తగునెనీకిది నాతల్లి!♦ సుగుణవల్లి!.

క॥ పదునాలుగేండ్లు పుచ్చెదఁ
బదునాల్గుదినంబులట్ల ♦ వగవకు జననీ!
మదికుదుటఁబఱచి జనకుని
బదిలముగాఁ జూచికొనుము ♦ పతిహితమతివై.

కౌసల్య దుఃఖముతో:—

క॥ రామా! సుజనారామా!
రామా! నాప్రాణధామ! రవికులసోమా!
రామా! రాజలలామా!
రామా! సుగుణాభిరామ! రామా! రామా!.

(సుమిత్ర యంతఃపురము.)

లక్ష్మణుఁడు తల్లిని సమీపించి:—

గీ॥ జనకువాక్యముఁబాలింప ♦ జనని! యదిగొ
యన్నకానల కరుగుచు ♦ నున్నవాఁడు
అతనివెంబడి నేనిదే ♦ యడవులకును
నరుగుచున్నాఁడ దీవించి ♦ యనుపుమమ్మ!.

సుమిత్ర యెంతయు సంతోషముతో:—

గీ॥ నిన్నుఁబోలిన సుతునినే ♦ నెమ్మిఁగాంచి
ధన్యురాలైతి లక్ష్మణా! ♦ ధన్యచరిత!
తండ్రిమాఱుగ రామునిఁ ♦ దల్లిమాఱు
సీతఁ జూచుచు వర్తిల్లఁ ♦ జెల్లుఁదనయ!

లక్ష్మణుఁడు దనభార్యయగు ఊర్మిళనుజూచి:—

క॥ నామాఱుగ నీయత్తలఁ
బ్రేమన్ సేవించి నాకుఁ ♦ బ్రియమొనరుపవే
నామాటకు నెదురాడకు
నామన్ననఁ బడయఁగదవె ♦ నళిన దళాక్షీ!

(రాజమార్గము.)

వనమునకు రథారూఢుఁడై పోవుచుండు సీతాసౌమిత్రులతోడి శ్రీరామునిఁజూచి ప్రజలు పట్టరాని దుఃఖముతో:—

గీ॥ ఈవు మారాజవౌదని ♦ యెలమినుండఁ
గైకపొగరింక నినుఁబంపెఁ ♦ గానవంకఁ
గమలమిత్రకులాబ్ధిరా ♦ కాశశాంక!
వత్తుమిదె వెంటఁ గొనిపొమ్ము ♦ వదల కింక.

అని మహావేగముతోఁ బోవుచుండు రథమును వెంబడింపఁజాలక

క॥ రామా! సుజనారామా!
రామా! మాప్రాణధామ! రవికుల సోమా!

రామా! రాజలలామా!
రామా! సుగుణాభిరామ! రామా! రామా!

అని విలపించుచు మరలుచున్నారు:—

(చిత్రకూట పర్వతము.)

రాముఁడు చిత్రకూటపర్వతమును జూపుచు సీతతో:—

ఉ॥ చిత్రవిచిత్రపుష్పఫల ♦ చిత్రితవృక్షలతావిశేషముఙ్
జిత్రవిచిత్రచర్మఖుర ♦ శృంగవిచిత్రితజంతుజాతముఙ్
జిత్రవిహంగసేవితముఁ ♦ జిత్రమహాకుహరీసమేతముఙ్
జిత్రఝరీప్రకాశితము ♦ సీత!యదేకను చిత్రకూటముఙ్.

అని యాపర్వతమునుజేరి లక్ష్మణుఁడు పర్ణశాల నిర్మింపగానందు సీతారామసౌమిత్రులు నివసించుచుండిరి:—

(కైకేయి యంతఃపురము.)

శ్రీరాముని వనగమనమును సుమంత్రుఁడు మనవిచేయఁగా విని దశరథుఁడు ఏకధారగాఁ గన్నులనీరు గార్చుచు:—

క॥ రామా! సుజనారామా!
రామా! నాప్రాణధామ! రవికులసోమా!
రామా! రాజలలామా!
రామా! సుగుణాభిరామ! రామా! రామా!

అని విలపించుచుఁ బ్రాణములను వదలును:—

(కేకయ రాజధాని రాజభవనము.)

భరతుఁడు:— శత్రుఘ్నా! యీయుత్తరము వసిష్ఠులు వ్రాసి నారు వినుము:—

చ॥ ఇనకులరత్నమా! భరత! ♦ యిచ్చటికార్యములెల్లఁ జూచిమీ
జననితలంచె నిన్నుఁగడు ♦ జాగొనరింపక వేగరావలెన్
దినమొకకల్పమై జరిగె ♦ దీనినిఁజూచిన తక్షణంబర
మ్మనుమనివ్రాయఁదెల్పిన ద♦దంతయునీకిటఁదేటయయ్యెడున్.

దీని యర్థమేమయి యుండును:—

శత్రుఘ్నుఁడు:— నేనును ఊహింపఁజాలకున్నాను. ఇప్పుడే మనము బయలుదేరవలయును:—

(అయోధ్య రాజవీధి.)

భరతుఁడు వినుచుండఁగాఁ బ్రజలు:—

క॥ రామా! సుజనారామా!
రామా! మాప్రాణధామ! రవికులసోమా!
రామా! రాజలలామా!
రామా! సుగుణాభిరామ! రామా! రామా!

అని విలపించుచుండుటనువిని శ్రీరామునకేమి సంభవించెనోయ

సి యుల్లము తల్లడించుచుండఁ దొందరగావచ్చి కైకేయి యంతఃపురమును బ్రవేశించుచున్నాఁడు:—

(కైకేయి యంతఃపురము.)

భరతుఁడు తల్లికినమస్కరించి దైన్యముతో శ్రీరాముఁడెక్కడనని యడుగఁగైకేయి:—

గీ॥ రామలక్ష్మణులరిగిర ♦ రణ్యమునకు
జనకుఁడో వృద్ధుఁడగుటను ♦ జనెను దివికి
నుత్తరక్రియ లొనరించి ♦ యుచితరీతిఁ
బట్టముఁగట్టికొమ్మునా ♦ పట్టి! నీవు.

భరతుఁడు కోపముతో:—

మోహన — రూపకము.

మాతవేకిరాతకీ! - ఘాతసేయుపాతకీ!
ఆతతసుగుణాభిరాము - సీతిమాలియడవిఁబంపితి ॥ మా ॥
రాతిగుండెదానవే - చేతమునుడికించితివే
పూతసూర్యవంశవి - ఖ్యాతినెల్లఁజెఱచితే ॥ మా ॥

ఆ,వె॥ మాటఁదిరుగుకంటె ♦ మరణము మేలను
పతిని జంపినట్టి ♦ పాపినీవు
నాకు మాతవైతి ♦ లేకున్న నీపేరు
లేకపూతుఁగాదె ♦ లోకమందు.

(చిత్రకూట పర్వతము.)

లక్ష్మణుఁడు చెట్టుపైనుండు పండ్లనుగోయుచుండి యయోధ్య వైపుననుండి దుమ్ము లేగుచుండుటనుజూచి రామదర్శనార్థమై ప్రజలతో భరతుఁడు వచ్చుచున్నాఁడని తెలియక తమపై దండెత్తివచ్చుచున్నాఁడనుకొని రాముని సమీపించి:—

గీ॥ భరతుఁడిటవచ్చుచున్నాఁడు ♦ దురితమెంచి
పఱచినేనొక్క కోలను ♦ భంగపఱతుఁ
జూడుమోయన్న! మనమీఁద ♦ వాడివెడలె
నింతకంటెను దురితమ ♦ దేమికలదు.

కమాచ్ — రూపకము.

సెలవా? తులువ భరతుని - త్రుళ్లడంచెద సెలవా?
అలయొక్క బాణాన - నతనిశిరముఁజిమ్మి
కులమునకంతకుఁ - గూరిమినొడఁగూర్తు. ॥సెలవా॥

శ్రీరాముఁడు:—

క॥ తొందరపడకుము లక్ష్మణ!
యెందునమదిఁ గీడుదలఁచి ♦ యెఱుఁగడు భరతుం
డెందులకువచ్చెనోయిటఁ
గందముకారణమువచ్చి ♦ కాంచినపిదపన్.

ఇంతలో భరతుఁడువచ్చి రాముని పాదములకెరగి చేతులుజోడించి కన్నీరు గార్చుచు నిలుచుండఁగా రాముఁడు నాయనగారు సేమమాయనియడుగ భరతుఁడు:—

గీ॥ రామ!ననుఁదమ్మునిగఁ గాంచి ♦ రాజ్యమొడలి
యడవిఁబోవఁగ నాయెనా ♦ యన్న!నీకుఁ
దండ్రిననుఁ బుత్రునిగఁగాంచి ♦ తల్లడిలుచుఁ
దనువు వదలంగవలసె నే ♦ మనుదురామ!.

అని విలపించును:—

శ్రీరాముఁడు తండ్రినిఁదలంచికొని:—

క॥ సత్యమువిడువంజాలక
సత్యవ్రత! మృత్యుసుఖము ♦ శరణువడసితే
నిత్యమగు కీర్తిఁగాంచియ
నిత్యపు దేహమునుబాసి ♦ నీవిటుతండ్రీ!.

అని విలపించి భరతా! మనమిరువురమునుగలసి పూజ్యులగునాయనగారి వాక్యమును జెల్లింపవలసియున్నది. నేను వనవాసముచేసి చెల్లించెదను. నీవు పట్టాభిషిక్తుఁడవై చెల్లింపుము. అయోధ్యకుఁబోయి పట్టాభిషిక్తుఁడవుగమ్ము:—

భరతుఁడు:—

ఉ॥ ఒల్లనురాజ్యమాపదవు ♦ లొల్లనయోధ్యనునొల్ల మాతనే
నొల్లను బంధుమిత్రతతి ♦ నొల్లశరీరపుసౌఖ్యమొల్లనే
నొల్లనుగానగీతముల ♦ నూర్జితరీతిని మీపదంబులన్
గొల్లగ సేవఁజేయఁగనె ♦ కోరితి నిమ్ము కృపాసముద్రమా!.

రాముఁడు— భరతా! నీకు నయోధ్యలోనుండుట కిష్టములేదేని

కాఫి — రూపకము.

పొమ్ము నందిగ్రామమందునఁ - బొందికన్ జనులందఱున్
సమ్మతింపఁగనాకు మారుగ - సల్పిరాజ్యము క్రమ్మఱన్
దెమ్మపదునాల్గేండ్లపిమ్మటఁ - దీర్చి జనకునివాక్యమున్
నెమ్మితోనేమరలినప్పుడు - నెయ్యమిట్టులె చూపుచున్.

భరతుఁడు:—

గీ॥ పట్టమున్ గట్టియన్న! మీ ♦ పాదుకలను
మించుమునివృత్తిఁ బ్రజలఁ బా ♦ లించువాఁడ
మీరురాఁగల సమయంబు ♦ మించెనేని
నగ్నిమార్గాన స్వర్గాన ♦ కరుగువాఁడ.

క॥ రామా! సుజనారామా!
రామా! నాప్రాణధామ! రవికులసోమా!
రామా! రాజలలామా!
రామా! సుగుణాభిరామ! రామా! రామా!

అని రాముని పాదుకలను శిరముపై నిడుకొని మరలును:—

(పం చ వ టి.)

తాను మిక్కిలి చక్కనిదను నభిమానముగల శూర్పణఖయను పేరుగల రావణుని చెల్లెలు రామలక్ష్మణులనుజూచి మోహించి తనలో:—

శంకరాభరణము — రూపకము.

ఇంతటిచక్కనివారల నెచ్చట - నెన్నఁడుగనలేదు
సంతతమును జిఱునగవులవింతగ - సంతసపఱచెదరు ॥ 1 ॥
అందముఁ రూపంబెత్తినరీతిని - నుందురుగదవీరు
డెందము పరమానందముఁబొందును - బొందినవీరలను ॥2॥
కనులకునలసుగఁ గలికియొకర్తుక - కనఁబడు వీరలతోఁ
జని పనికత్తెగనుండి దానినిఁకఁ - జంపి సుఖించెదను. ॥3॥

ఇట్లనుకొని వారినిసమీపించి ముప్పురకును మూఁడు పూలహారములు సమర్పించి శ్రీరామునితో:—

గీ॥ దిక్కులేనియనాథను ♦ దీనురాల
యభయమిచ్చెడి వారొక ♦ రైన లేమిఁ
దిరిగి వేసారితిని నన్నుఁ ♦ గరుణఁజూచి
శరణ మొసఁగిన మీసేవ ♦ సలుపుదాన .

శ్రీరాముఁడు లక్ష్మణునితో:—

గీ॥ అంతలేని యనాథఁట ♦ యుండనిమ్ము
సీతకొకయింత పరిచర్య ♦ సేయఁగలదు
ఒంటిగానున్నవేళఁ గా ♦ వుండఁగలదు
అతివ లెంతయుఁ గోరుదు ♦ రాఁమతోడు.

శ్రీరాముఁడు శూర్పణఖతో:—

గీ॥ సీతచెప్పిన పనులను ♦ జేయుచుండి
యోగ్యవర్తనగల్గి నీ ♦ వుంటివేని
మదిని నీకు భయమ్మను ♦ మాటలేక
హాయిగానుండఁగలవు మా ♦ యాశ్రమమున.

(గోదావరీ తీరము.)

సీత లోతైనమడుగులోనికిదిగి ముక్కును జెవులను మూసికొని స్నానముజేయుటకై మునుకవేయుచుండఁగా శూర్పణఖ ముంచి చంపవలయునని గొంతుపైఁజేయివేయును:—

సీత:— క॥ రక్కసిపట్టెను రామా!
రాముఁడు:— ఎక్కడ లక్ష్మణుఁడు
లక్ష్మణుఁడు:— చిక్కెనిదె పడెశిలపై
ముక్కు చెకచెక్కలయ్యెను
రాముఁడు:— జక్కఁగఁబోనిమ్ము దానిఁ ♦ జంపకుమనుజా!.

(జన స్థానము.)

శూర్పణఖ సురాపానముఁ జేయుచున్న తన బంధువులును సేనాధిపతులును నైన ఖరదూషణత్రిశిరాదుల సమీపించి:—

నాథనామక్రియ — రూపకము.

అన్నలార! నన్నుఁ జంపరే
అన్న రాఘముల్ సేసిన - బన్న మేనోర్వఁజాల ॥ అన్న ॥
నన్నుఁ జూచిమోహమంది - కన్నుసైగఁజేసిన
అన్న! తిట్టనన్నుఁబట్టి - యిన్నిపాట్లుపెట్టిరే. ॥అన్న॥

ఖరుఁడు:—

చ॥ అలలల వారిగుండియల ♦ నట్టెవిదిల్చెద నార్చి పేర్చి నా
చలముబలమ్ము తేటపడఁ ♦ జంపెదశూర్పణఖా!సహోదరీ!
విలవిల యేడ్వఁబోకునిను ♦ వేదనఁబెట్టిన వారిమొండెముల్
తెలలనువేఱుచేసి యిదె ♦ తప్పక తెచ్చెదవారిఁజూపవే.

అని ఖరుఁడు దండెత్తి పోవుచున్నాఁడు. శూర్పణఖ దారిచూపుచున్నది:—

(పంచవటి పర్ణశాల.)

లక్ష్మణునిఁజూచి రాముఁడు:—

ఉ॥ తమ్ముఁడ!చూడురక్కసుల ♦ దండులవే మనమీఁదవచ్చెడిన్
గొమ్మనుజూచికొమ్మదిగొ ♦ కోయను బొబ్బవిసంగవచ్చెనే

నెమ్మెయి వారిఁ జంపి యిదె ♦ యిప్పుడె వచ్చెదఁ బొమ్ము నాదువి
ల్లమ్ములఁ దెమ్ము నీవు తను ♦ వంతటఁ గన్నులుగల్గియుండుమా.

(ఒక గుట్ట.)

దానిపైనుండి గురిఁజూచి శ్రీరాముఁడు రక్కసులపై బాణము
లఁ బ్రయోగించుచున్నాఁడు:—

శూర్పణఖ:— (హా!

చ॥ అదెయదె వచ్చె వచ్చె ఖర! ♦ యమ్మది దూషణుఁ జంపెఁ జంపె
ఖుదెయిదె మించు మించసఁగ), నీ త్రిశిరుం దెగటార్చె నీశిరం
బదెయదె గుండె జల్లనఁగ ♦ నందఱఁ గూల్చె నిదొక్కఁడూ పెహా
యదె వడి వాడి బాణమదె ♦ హా ఖర! నిన్ను నుజంపివైచెనే.

(లంక రావణుని యేకాంతమందిరము.)

శూర్పణఖ:—

కాంభోజి — రూపకము.

అన్నా! నీకొఱకు - వన్నెలాడిని వెదకి - యిన్ని పాటులుపడితి
విన్నవించెద నేను- మన్నించు నా పలుకు- బన్న మోర్వఁగలేను
బంధులిందఱిలోన ॥ అన్నా ॥

రావణుఁడు:—

క॥ బన్నము నీదట్లుండనె
యన్నారీ రత్న మెవరె? ♦ యది దెలుపవె నేఁ
గన్నారఁగాంచి తెచ్చెద
నెన్నేని నుపాయముల న ♦ దెచ్చుటనున్నన్.

శూర్పణఖ:—

శా॥ అన్నా! రావణ! నేనుజూచినదిలే ♦ దాయందమెందేనివే
కన్నుల్ గావలెఁజూడఁగావలసినన్ ♦ గల్యాణిలావణ్యముల్
గన్నన్ జెప్పలబోలెఁగా చెదరువీఁ ♦ కన్ రామసౌమిత్రుతో
యన్నా! పంచవటీతటంబునమహా ♦ యత్నంబుచేసాధ్యమా

క॥ నీభోగభాగ్యగరిమకు
నాభవ్యాంగనయుఁగూడ ♦ నలవడెనేనిన్
శోభకుఁదోడుసుగంధ
ప్రాభవమందుటయెకాదె ♦ స్వర్ణంబునకున్.

(పంచవటి పర్ణశాల.)

రావణుఁడు సన్యాసివేషముతో సమయమును నిరీక్షించుచుఁజె
ట్లనడుమ డాగియుండఁగా:—

సీత పర్ణశాల వాకిట నిలఁబడి లక్ష్మణునిజూచి:—

మ॥ కనుమోలక్ష్మణ! జింకనుందఱుము వ్యా ♦ ఘ్రంబున్ వ
డిన్ గూల్పఁగా]
వెనువెంటన్ జనుచున్నవారదిగో వే ♦ విల్లంది మీయన్నగా
రనురాగాతిశయంబదెంతటిదొయ ♦ న్నా! దూరమున్ గీరమున్
మొనరాళ్లున్ గినరాళ్ళుచూడకకరం ♦ బున్ బారుచున్నారదే.

రావణుఁడు తనలో:—

గీ॥ పులినివెన్నంటిరాముండు ♦ పోయెఁగాని
యతనివెదకంగ లక్ష్మణుం ♦ డరిగెనేని
నొంటిగాఁబర్ణశాలయం ♦ దుండుకతన
సులభముగఁజిక్కునాకు నీ ♦ సుందరాంగి.

(అడవి.)

శ్రీరాముఁడు:—

గీ॥ మించుగురిఁజూచివ్యాఘ్రమున్ ♦ ద్రుంచివైచి
కడకులేడినిఁగావంగఁ ♦ గంటిఁగాని
చాలదూరమువచ్చితి ♦ జాలమయ్యె
దేవినాజాడఁగనకభీ ♦ తిల్లునేమొ
శీఘ్రముగఁబర్ణశాలనేఁ ♦ జేరవలయు.

(పంచవటి.)

సీత తనలో:—

ముఖారి — రూపకము.

తడవేలచేసెనో - ధరణీశుఁడకట
అడవులఁబడిపోయి - కడుబడలినాఁడో ॥తడ॥
అటుపోయిదూరాన - ఆకొండచాటున - తటుకునఁగను
మఱఁగి తడవాయెరాఁడు. ॥తడ॥

లక్ష్మణునిజూచి ప్రకాశముగా:—

శా॥ అన్నా! లక్ష్మణ పోయియార్యయఁగదే ♦ యానందసంవర్ధనుఁ
డన్నాథుఁ గమహనీయసద్గుణహితుఁ ♦ మత్ప్రాణసంశోషణుఁ
మున్నెన్నండును జేయఁడింతతడవుఁ ♦ బోపొమ్ము వేవేగమీ -
యన్నన్ దెచ్చిమదీయహృద్గతవిచా ♦ రాగ్నిన్ని వారింపవే.

లక్ష్మణుఁడు:—

హంసధ్వని — రూపకము.

తల్లి! వెఱువకు - మాతల్లి! వెఱువకు
తల్లడిల్లి తెల్లబోకు ॥తల్లి॥
చల్లపడినతోడనే - యుల్లమురంజిల్లఁగా
అల్లమాయన్నగారు - చల్లగానువత్తురు. తల్లి॥

సీత:—

చ॥ కపటమునీమనంబునను ♦ గల్గఁగఁబోలునులేకయున్న నీ
వ్రపకృతులందొఱంగియిటు ♦ లుందువె లక్ష్మణ! యన్నజాడఁబో
కపయశముఁ గడించితివె ♦ యన్యుఁడవే! నెనరైనలేదె నా
తపములపంట యాపతికిఁ ♦ దమ్ముఁడవై యిటుసేయఁజెల్లునే

లక్ష్మణుఁడు:—

గీ॥ ఒంటిగాఁదల్లి! నినునాకు ♦ టింటవదలి
పోవఁజాలకయుంటి నేఁ ♦ బోయివత్తు
వేఱుగానెంచఁజాలునే ♦ విమలసూర్య
వంశమణియగు దశరథు ♦ పట్టిపేఁడు.

అని వెడలిపోవును:—

(పంచవటి పర్ణశాల.)

రావణుఁడు సన్యాసివేషముతోఁ బర్ణశాలసమీపించిసీతతో:—

కమాచ్ — రూపకము.

భిక్షపెట్టవే - అక్షయముగనాకునొక్క - భిక్షపెట్టవే
భిక్షవేఱుకాదు - నీకటాక్షముంచిప్రోవవే
రాక్షసేశ్వరుండనాకు - రాణివై చెలంగవే ॥ భిక్ష ॥

సీత భయపడి దూరముపోవుచున్నది:—

రావణుఁడు మఱింత సమీపించి:—

శరణమియ్యవే - తరళనయన! తాళఁజాల - శరణమియ్యవే
తరుణి! నామనంబెఱింగి - ధన్యుఁజేసికావవే
అరయనాదురాజ్యరమకు - నందమై చెలంగవే ॥ శరణ ॥

సీత ధైర్యముతో:—

శా॥ ఓరీ పాప పరాయణా! వదరెదే ♦ యున్మత్తతన్ రావణా!
శూరాగ్రేసరురామచంద్రుయువతిన్ ♦ జోరుండవై డాయుదే
నీరాజ్యంబునునిన్నునీదళములన్ ♦ నిర్మూలముంజేయునా
శ్రీరాముండిదెచేరవచ్చెఁదనదౌ ♦ శౌర్యంబవార్యమ్ముగాన్

రావణుఁడు:—

క॥ నామముందు రాము గీముని
నేమనిపొగడెదు సురేంద్రుఁ ♦ డేమొదలుసురల్
నామరుఁగుజొచ్చి బ్రదుకఁగ
లేమా! లెమ్మింకజాగు ♦ లేదిటనీకున్.

సీత భయముతో:—

శా॥ రామా! రక్కసుబారికిన్ బడితినే ♦ రావే. శరౌఘంబుచే
నీమూర్ఖున్ ధనుజాధమున్ దునుమవే ♦ యీడ్చెంగదే ఱెక్కలన్
నామానంబెటుగాచికొందునెకదే ♦ నన్బ్రోచు వారెవ్వరే
యేమీయంచనువారుఁగూడనిటలే ♦ రేఁయీశ్వరా! కావవే.

సీత రావణుని విమానముపైనుండి:—

ఉ॥ భూమికిఁబోల్లి ప్రాణములఁ ♦ బుచ్చెదరావె మదీయ దేహమున్
రామ! త్వదీయహస్తములఁ ♦ బ్రజ్వలితాగ్ని నిసంస్కరింపవె
నీ మొగమున్ గనుంగొనుచు ♦ నేనసువుల్ విడనాడు పుణ్యమున్
రామ! కనంగనైతిఁగదె ♦ రాజకులాంబుధిపూర్ణ చంద్రమా!.

సీతనులాగి విమాన స్తంభమునకుఁగట్టి రావణుఁడు:—

క॥ ఇక్కడి కాకులు చిలుకలు
నిక్కడి యీ పెద్దగ్రద్ద ♦ యిట్టులు నన్నున్
ముక్కులఁ బొడువం జొచ్చెను
ఱెక్కలఁజెక్కెదను సీత ♦ ఱెచ్చపడంగాన్.

అని గ్రద్దను నఱికివేయును:—

సీత:—

క॥ అయ్యో! గ్రద్దా! నాకయి
 కయ్యముచేసితివె కొనకు ♦ ఖడ్గపుధారన్
 నెయ్యమెఱింగించిపడితే
 యియ్యధమాధముని చేత ♦ హీనుని చేతన్.

సీత తన నగలను జెఱఁగులో మూటగట్టి విమానమునుండి వేయుచు

చ॥ వనచరులార! రామనృప ♦ పత్నినినన్ను బలాత్కరించియీ
 దనుజుఁడుదొంగిలెన్ వినుఁడు ♦ తిప్పకసన్ వెదకంగరాముఁడీ
 వనమునుజొచ్చునప్పుడివి ♦ వారకనాదగు భూషణంబులన్
 గనికరముంచియుండుననుఁ♦గావఁగదెల్పుఁడుపుణ్యమబ్బెడిన్.

రావణుఁడు సీతతో:—

సీ॥ సీత! నీకివెమంచి చీనాంబరములుండ
 నారచీరలివేల ♦ నారి!నీకు
 నవరత్నమయభూష ♦ ణంబులెన్నియొయుండ
 నడవిపూవులివేల ♦ యతివ!నీకు
 చారుచంద్రోపల ♦ సౌధమ్ములివియుండఁ
 బర్ణశాలలవేల ♦ పడఁతి!నీకు
 వివిధమద్యమ్ములున్ ♦ వెలయుమాంసములుండఁ
 గందమూలములేల ♦ కలికి! నీకు

గీ॥ నిరుపమానపరాక్రమ ♦ తరుణతరణి
కిరణవిదళిత శత్రుని ♦ కరమహాంధ
కారుఁడై ముజ్జగంబులఁ ♦ బేరుగొన్న
రాక్షసేశ్వరుఁడేనుండ ♦ రాముఁడేల.

(అశోకవనము)

సీత:—

క॥ రామా! సుజనారామా!
రామా! నాప్రాణధామ! రవికులసోమా!
రామా! రాజలలామా!
రామా! సుగుణాభిరామ! రామా! రామా!

(అడవి)

రాముఁడు లక్ష్మణునితో:—

తోడి—రూపకము.

అటుసీతనుంచి నీ - విటురాగఁజెల్లునే
కుటిలాత్మ లెందఱో - యటవింజరింతురే ॥అటు॥
పదవేగలక్ష్మణా! - పద్మాక్షిఁజూతము
అదియేమొ తెలియదు - మదిలోగలంగెను ॥పద॥

రాముడు:—

శా॥ సీతా! సీత! పతివ్రతాతిలకమా! సీమంతినీరత్నమా!
సీతా! యీకుటి చిన్నవోయెఁ గదవే సీతా!మనోహారిణీ!

సీతా! పిల్చిన వచ్చిపల్కవుగదే సీతా! సుధాభాషిణీ!
సీతా! నన్విడనాడఁజాలకవనిఁ సేవించి నన్బాసితే.

రాముఁడు లక్ష్మణునితో:—

సీ॥ జలకమాడంగను ♦ జలజాక్షి పోయెనో
తమ్ముఁడా! చూడుము ♦ తడయఁబోకు
కొమ్మపూలోయంగఁ ♦ గొమ్మపై కెక్కెనో
తమ్ముఁడా! చూడుము ♦ తడయఁబోకు
పులిజాడయేమైనఁ ♦ బొడగాంచఁగలైనో
తమ్ముఁడా! చూడుము ♦ తడయఁబోకు
తలుపువెన్కనుడాగి ♦ తరళాక్షియున్నచో
తమ్ముఁడా! చూడుము ♦ తడయఁబోకు
గీ॥ పెద్దకాళ్లనుచినకాళ్లు ♦ వేఱువేఱు
గానఁబడెరక్కసుండు దాఁ ♦ గాంతఁగొంచు
నేగియుండునుగాఁబోలు ♦ వేగనరిగి
వెదకుదమురమ్ము తమ్ముఁడా! ♦ వెలఁది నిచట.

(అడవి)

రాముఁడు:— ఖరహరప్రియ — రూపకము.

ఎటుమరచియుందు - ఇందువదన! నిన్ను - నెటు మరచియుందు
కటకటా! నీరూపు - కనులఁగట్టియుండ ॥ఎటు॥
ఇటలేళ్లమేపి - యటఁజెట్లఁబెంచి - యిటఁబక్షులనుసాకు
చెటఁబోతివీవు ॥ఎటు॥

(శబరి యాశ్రమము.)

శబరిరామునితో:—

గీ॥ రామ! నీరాకఁగోనిపోయె ♦ రావణుండు
పాణమర్పించె నెదిరించి ♦ పక్షిరాజు
విన్నవింపంగ నేనిట ♦ నున్నదాన
శబరినా పేరు తపమును ♦ సలుపుదాన
భక్తి నేనిడుతీయని ♦ పండ్లఁగొనుము
పంపదరిగిరి సుగ్రీవు ♦ పజ్జఁజేర
శుభమగును బొమ్ము శ్రీరామ! ♦సుగుణధామ!.

శ్రీరాముఁడు లక్ష్మణునితో:—

గీ॥ పరహితమె తమధర్మమై ♦ పరఁగుచుండు
నీమహోదారచిత్తుల ♦ కెవరు సములు
ఏమిచేసినతీరునీ ♦ యింతిఋణము
పాణమర్పించినట్టియా ♦ పక్షిఋణము.

(పంపాసరోవరము.)

శ్రీరాముఁడు లక్ష్మణునితో:—

గీ॥ సదమలంబగు జానకీ ♦ చరితవోలె
రాజిలుచునుండు పంపాస ♦ రమ్ముఁజూడు
దీనిచక్కని చల్లని ♦ తీరమందు
శాంతముగ విశ్రమింతము ♦ కొంతతడవు.

ఎదుటి ఋష్యమూక పర్వతమునుండి దిగివచ్చుచుండు నొకనిఁ జూచి శ్రీరాముఁడు:—

గీ॥ బ్రహ్మతేజంబుముఖమునఁ ♦ బరఁగువాఁడు
బలజవంబుల నెంతయుఁ ♦ జెలఁగువాఁడు
అదిగో దిగి వచ్చుచున్నవాఁ ♦ డద్రినుండి
యాతఁడెవ్వండొ లక్ష్మణా! ♦ యరసిరమ్ము.

గిరి దిగివచ్చిన హనుమంతుఁడు లక్ష్మణునితో:—

గీ॥ అన్న తనకాంతఁ బట్టిన ♦ ఖిన్నుఁడగుచు
నద్రినుండెడు సుగ్రీవుఁ ♦ డడవిఱేఁడు
మీరలెవ్వారొ గనుఁగొనఁ ♦ గోరిపంపె
నతనిమంత్రిని హనుమంతుఁ ♦ డంద్రు నన్ను.

లక్ష్మణుఁడు శ్రీరామునిఁజూపి హనుమంతునితో:—

చ॥ ఇనకులరత్నమా దశర ♦ థేశుని పుత్రుఁడు పేరురాముఁడౌ
జనకునివాక్యపాలనము ♦ సల్పవనంబుననుండ జానకిన్
దనసతిఁగోలుపోయెవిను ♦ తత్పతినారయవచ్చి యిచ్చటన్
జనపతియున్నవాఁడుదన ♦ సాయముమీపతికిచ్చుఁగోరినన్

హనుమంతుఁడు సుగ్రీవునిదోడ్కొనివచ్చి శ్రీరామునికిఁజూపి:—

గీ॥ వాలిబలశాలి తనప్రియు ♦ రాలిఁబట్ట
ఖిన్నుఁడై యద్రినుండు సు ♦ గ్రీవుఁడిదిగో

శరణుఁజొచ్చెను శ్రీరామ! ♦ కరుణఁజూడు
దీనరక్షయె నృపులకు ♦ దీక్షగాదె.

శ్రీరాముఁడు సుగ్రీవునితో:—

ఉ॥ నీరిపు వాలిణవాయువుల ♦ నేనొక బాణముచేతఁగ్రోలినీ
దారను రాజ్యముఁ మరలఁ ♦ దప్పకనీకొదవంగఁజేసెదన్
ధారుణితారుమారయినఁ ♦ దప్పదునావచనంబుచూడుమో
వైరికలోకపాలక!స ♦ ఖా!యిదెచేతనుజేయివేసితిన్.

సుగ్రీవుఁడు:—

చ॥ దినకరవంశపావన !మ ♦ దీయపురాకృతపుణ్యరూపమో
యననిటనామనోరథము ♦ నంతనుదీర్పఁగనున్నవారు మీ
యనుచరుఁడై మెలంగెదను♦ నందులసాక్షిగఁగొండుమీసతిన్
దనుజుఁడుగొంచుపోవునెడఁ ♦ దత్సతిరాల్చినభూషణావళిన్

సీత తన నగలఁగట్టివైచిన చెఱఁగునుజూచి శ్రీరాముఁడుతనలో

సీ॥ ప్రణయకోపపువేళఁ ♦ బడఁ!తినీపడకగాఁ
జెలువుగాంచినదియా ♦ చెఱఁగుగాదె
ఎండగాచెడివేళ ♦ నింతి!నీగొడుగుగాఁ
జెలువుగాంచినదియా ♦ చెఱఁగుగాదె
చెమటపెట్టినవేళఁ ♦ జేతివీవనగాఁగఁ
జెలువుగాంచినదియా ♦ చెఱఁగుగాదె

నా కాళ్లతడియొత్త ♦ నీకువస్త్రమ్ముగాఁ
జెలువుగాంచినదియీ ♦ చెఱఁగుగాదె

గీ॥ అట్టిచెఱఁగున నగలను ♦ గట్టియిట్లు
నాకుగురుతుగ రాల్చితే ♦ నాతిమిన్న!
సీత! నీమాఱుదీనిని ♦ ప్రీతిఁజూతు
సీత! నినుఁబొందునాఁడు నీ ♦ చేతికిత్తు.

(కిష్కింధ.)

వాలితారతో:—

గీ॥ నెఱపినెయ్యమ్ము రాముఁడర్క ♦ నృపతితోడ
నన్నుఁజంపంగసుగ్రీవుఁ ♦ డున్నవాఁడు
వడివడిగఁబోయిపైఁబడి ♦ పిడుగువోలె
నిరువురనువచ్చివచ్చెద ♦ నిపుడెచూడు
తార!సుగుణవిహార! సౌం ♦ దర్యపూర!.

తార:— కమాచ్ — రూపకము.

పరనారీసంపర్కము - పరమదురితము - పరనారీసంపర్కము
దరిలేనిదుఃఖము - దొరకొనఁజేయును ॥ పర ॥
సిరుల దొలంచును - జిరకీర్తి మాపును - పరమపూరునికైనఁ
బరిభవమొనరించు ॥ పర ॥
చరణములనుబడి - స్వామి!నిన్వేడెదఁ - దరళాక్షి తారుమను
దమ్మునికొసఁగుము. ॥ పర ॥

వాలి:— శంకరాభరణము — రూపకము.

చాలుఁజాలు తార!ని - ర్మూలమిపుడు చేసెదన్
చాలవాగఁబోకు తార!- చావమోదివేసెదన్.

(పంపాతీరము.)

శ్రీరాముఁడు సుగ్రీవునితో:—

గీ. సామమునఁగార్యమొదవిన ♦ నేమముగద
యనుజుఁబంపెదసంధికా ♦ ర్యమ్మునీర్ప
వాలివినకుండ నెదిరింప ♦ వచ్చెనేని
నొక్కబాణంబుచేవాని ♦ నుక్కడంతు
భయముపడకుము సుగ్రీవ! ♦ భవ్యభావ!.

హనుమంతుఁడు అతిరయమ్మున శ్రీరామునిసమీపించిప్రభూ!:—

గీ॥ ఉరుముఁబోలినభీకర ♦ స్వరముతోడఁ
జండమారుతమట్లు ప్ర ♦ చండగతిని
వాలిమనపయివాలఁగా ♦ వచ్చెనదిగో

అని వాలిని జూపును శ్రీరాముఁడొక్కబాణముతో వాలిని నేల గూల్చెను:—

హనుమంతుఁడు:— అహహా!రాఘువ!నీశర ♦ మద్భుతంబు
పగతుతల నడెగొంపోయె ♦ గగనమునకు.

అందరు సంతోషముతో:—

(కమాచ్ — రూపకము.)

రామరాజభూషణ! రాక్షసకులభీషణ! సామమధురభాషణ!
సాధుతాపశోషణా! . ॥ రామ ॥

శ్రీరాముఁడు సుగ్రీవునితో:—

గీ॥ ఆగ్రహమువూని సుగ్రీవ! ♦ యగ్రజునకు
నుత్తరక్రియలొనరించి ♦ యుచితరీతి
తారనోదార్చి తత్సుతుఁ ♦ జేరఁదీసి
యెలమిఁ గిష్కింధ నిశ్శంక ♦ నేలుమింక.

(కిష్కింధ వెలుపలి మైదానము) (బయలు.)
సమస్త సేనాధిపతులతోఁ గూడి సుగ్రీవుఁడు రాఁగా శ్రీరాముఁడు.

ఉ॥ యోజనమబ్ధినీదితగు ♦ యుక్తి నిలంకనుజొచ్చి సీతస
ద్రాజనిభాననన్ వెదకి ♦ రాగలవీరుని చేతికిత్తునా
పూజితమంగుళీయకముఁ ♦ బొల్పుగ సీతకు నానవాలుగా
నాజనకాత్మజాకుశల ♦ మారయు నాతఁడు నాకుఁ బ్రాజ్యుఁడౌ

హనుమంతుఁడు ముందరకువచ్చి శ్రీరామునిఁ జూచి:—

గీ॥ రామ! మీభక్తునకు సము ♦ ద్రంబదెంత
యసురపురమెంత మాతను ♦ సరయుటెంత
గాంచి దేవిని రావణు ♦ గర్వమడఁతుఁ
బంపుమి దెపోయి వచ్చెదఁ ♦ బ్రభువతంస! .

(లంక, మహాద్వారము.)

లంకాధిపతియగురావణేశ్వరుని యుత్తరువులేనిది యెవరును లంకలోనికిఁ బ్రవేశింపఁగూడదని ద్వారపాలకుఁడు హనుమంతు నినడ్డగించెను. హనుమంతుఁడు ఆద్వారపాలకుఁడు ఆశ్చర్యపడు నట్లు తనతొడలోని రక్తముఁదీసి యొకపెద్దముల్లుతో నొకవిశా లమైన యాకుపై నొకయుత్తరమునువ్రాసి లంకాధీశునకుఁ బం పవలయునని ద్వారపాలకునకునిచ్చెను:—

(లంక, సభాభవనము.)

రావణుఁడు ఆలకింపఁగాఁ బ్రహస్తుఁడు హనుమంతునియుత్తరము నిట్లు చదువుచున్నాఁడు:—

శా॥ ముల్లోకంబులరాజువెల్లవడఁ కే మోదంబుతోనేలునో
కల్లోలాంచితభూరివార్ధివృత లం ♦ కాద్వీపరక్షోధిపా!
మల్లుండనే దమమల్లరంగమున స ♦ న్మానంబుఁబొందంగనా
యుల్లంబున్నదిపన్నవించితిఁబ్రభూ!♦ యుష్మత్ప్రసాదంబుకై

రావణుఁడు తక్షణమేపిలువనంపవలయునని యుత్తరువుచేసెను. హనుమంతుఁడు బ్రవేశించి మొగ్గలోమొగ్గలో మొగ్గవేసి అనఁ గా అంతరాంతరపల్టీగొట్టి చేతులుజోడించి నిలచి రావణేశ్వరుని యాశ్చర్యములో ముంచివేసెను:—

హనుమంతుని జూడఁగనే మల్లురందఱగుండెలోరాయి పడిపో యెను:—

రావణుఁడు హనుమంతునకు గొప్పగొప్పబిరుదులను గొన్నతన జగజెట్టులనుజూపి వీరిలోనెవరితోఁబోరెదవనియడిగెను:—

హనుమంతుఁడు అందఱితో నొక్కతూరి పోరెదనని చెప్పి రావణేశ్వరుని యెట్టయెదుటనిలఁబడి తనరెండుభుజములనుజాచి మల్లురనందఱనుబిలచి గట్టిగా విడువకుండఁబట్టుకొనవలెనని యాజ్ఞాపించెను. అట్లువారుపట్టుకొన్నవెంటనే యొక్కసారిగిఱ్ఱుమని తిరిగెను. వారందఱు విసరివేసినట్లు నలువైపుల దూరముగఁబడిపోయిరి. కొందఱకుఁగాళ్ళువిఱిగెను. కొందఱకుఁజేతులువిఱిగెను కొందఱకుఁ బండ్లురాలిపోయెను. కొందఱకు ముక్కుచెక్కలయ్యెను. అందఱును వికలాంగులయిరి:—

రావణుఁడుమెచ్చి హనుమంతునితో:—

శా॥ ఆహా! బాహుబలంబులాఘవమదే♦యాశ్చర్యమాశ్చర్యమా
ఆహా! నాకిఁకనుద్ధిలేరెచట నా ♦ కానందమున్ బెంచితే
నూహన్ వేఁడుమదేమి కావలయునో♦యుత్సాహముప్పొంగఁగా
బాహాటంబుగనిత్తుఁజూడుమిదెమ♦త్ప్రాసాదసౌధాదులన్.

హనుమంతుఁడు:—

క॥ లంకాద్వీపంబంతయు

రావణుఁనిగుండె జల్లుమనును:—

హనుమంతుఁడు మరల:—

క॥ లంకాద్వీపంబంతయు
శంకాతంకములు లేక ♦ చని చూడంగన్
సంకేతపత్రి మొసఁగుము
ఇంకేమియుఁగోర రాక్ష ♦ సేశ్వర! నిన్నున్.

రావణుఁడు మంత్రియగు ప్రహస్తునిఁజూచి తక్షణమే యిమ్మని యాజ్ఞాపించును:—

(అశోక వనము.)

హనుమంతుఁడు ఆకసమువంకఁజూచి:—

గీ॥ వెండిపంజరమునహంస ♦ వెలయునట్లు
మందరపుగుహసింహంబు ♦ మసలుకరణి
మదగజముమీఁద వీరుండు ♦ పొదలుతీరు
మింటనెంతయుఁజంద్రుండు ♦ మెఱయఁదొడఁగె.

గీ॥ దాసదాసీజనంబులు ♦ దన్నుఁగొలువ
రావణుండును నీదారి ♦ రాఁదొడంగె
వీనులకు రామశబ్దంబు ♦ వినఁగవచ్చె
నుండితీరును సీతయీ ♦ యుపవనమున.

(అశోకవనమున వృక్షముక్రింద)

సీతకూర్చొనియుండఁగా వెనుక హనుమంతుఁడొదిగియుండును రావణుఁడువచ్చి సీతనుజూచి:—

శంకరాభరణము — రూపకము.

ఇంకైనదయరాదా - ఇంతి!నామీఁద - ఇంకైనదయరాదా
పంకజలోచన! - సంకటపెట్టకు - లంకారాజ్యమునీది - కింక
రుఁడనునేను. ॥ ఇం ॥

సీత:—

మ॥ తులువా!నోటికివచ్చినట్టులిటులెం ♦ తోప్రేలెదాఁగాకసీ
తల రాముండెగఁజిమ్మనీమదముద ♦ గ్ధంబౌనుబోపొమ్మనీ
వలరామాధిపుకంటెశూరుఁడయిన న్ ♦ హాదుష్ట!నీవిట్లు దొం
గిలి న న్దెచ్చెదవేకిరాతక!మహా ♦ క్లేశంబునేనొందఁగాన్.

రావణుఁడు:—

గీ॥ చెచ్చెరనుబోయినీపతి ♦ శిరముఁదెచ్చి
ముందుఁ బడవైతునపుడేని ♦ సుందరాంగి!
శూరుఁడెవ్వండొకనులారఁ ♦ జూడఁగలవు
రావణుండన్నధరలోనఁ ♦ గేవలుండె? అని వెడలి
పోవును.

సీత:—క॥ రామా! సుజనారామా!
రామా! నాప్రాణధామ! రవికులసోమా!
రామా! రాజలలామా!
రామా! సుగుణాభిరామ! రామా! రామా!

హనుమంతుఁడు:—

క॥ శ్రీరాము బంటుబంటను
నీరాకరమీఁది లంక ♦ నిన్నిటుగంటిన్
ఆరేనియుంగ్రమిదిగో
వేఱొకటేదైనగురుతు ♦ వేఁడెదఁదల్లీ!.

సీత:—

సీ॥ అనిలోనరిపుఁజంపి ♦ ననుఁగాచువనియెడి
మదిలోనియాశచే ♦ మంటినసుము
ఆలక్ష్మణునినొవ్వ ♦ నాడినందులకయి
వెంటనేతగుశిక్షఁ ♦ గంటిననుము
ఆనాథుసుగుణాళి ♦ నాత్మలోఁదలఁచుచు
నుచితవర్తనమున ♦ నుంటిననుము
మాసమ్ములోవచ్చి ♦ మఱిఁగావకుండిన
ననువులఁదొఱఁగెద ♦ నంటిననుము

గీ॥ సర్వముసెఱింగిసట్టియా ♦ స్వామికేను
నింతకంటెనుజెప్పంగ ♦ నెఱుఁగననుము
పరమపూజితుఁడైనయా ♦ ప్రాణవిభుని
చరణపద్మమ్ములకు నమ ♦ స్కారమనుము
గురుతుగా నాశిరోమణిఁ ♦ గొనుము చనుము.

(లంక విద్యుద్యంత్రశాల)

హనుమంతుఁడు సంకేతపత్రమునుజూపి లోనికివెళ్లి యంత్రము
ను బగులఁగొట్టును:— (లంక తగులపడును.)

రావణుఁడు:—

గీ॥ గుడులుమేడలు గోపురాల్ ♦ కూలెనవిగో
అంతటను భగ్గుమనిమాట ♦ లలమెనవిగో
మెఱపుమఱ్రవచ్చిలంకను ♦ జెఱచియిటు
నష్టమొనరించినట్టియా ♦ దుష్టుఁడెవఁడు
నాయెదుటఁ దెండుకసిదీఱ ♦ నఱకివైతు
సరిభయంకరవీరసిం ♦ హమ్ములార!.

హనుమంతుఁడు:—

గీ॥ నేనెచెఱచితిఁ ♦ జెఱచితినేనెసుమ్మ
చేరిననుఁబట్టుకోఁగల ♦ వీరుఁడెవఁడు
రామభటుఁడను హనుమంత ♦ నామకుఁడను
మల్లుఁడను పేరవచ్చినా ♦ మహిమఁజూపి
మరలుచున్నాఁడ రాముని ♦ శరణుఁజొచ్చి
బ్రదుకు రావణ! చెడకు నా ♦ పలుకువినుము
నీవువినకున్న రాముని ♦ నిశితశరము
నీశిరముఁద్రుంచు ననిలోన ♦ నిక్కువమ్ము.

అని రావణునిఁదన్ని సముద్రములోఁబడి యీఁదుకొని వెళ్లిపోవును

(మహేంద్రపర్వతప్రాంతము.)

హనుమంతుఁడు రావణునితో:—

సీ॥ కన్నీరు కాల్వలై ♦ కారు కన్నులతోడఁ
జెక్కుటఁ జేర్చిన ♦ చేయితోడ
తెలతెలఁబారిన ♦ దీనాననముతోడ
జడలుగట్టిన శిరో ♦ జములతోడ
వేఁడినిట్టూర్పుల ♦ వాడునాసికతోడఁ
గడుఁజిక్కిస్రుక్కిన ♦ యొడలితోడ
అట్టెచినింగిన ♦ కట్టువస్త్రముతోడ
నోట రామా! యనుమాటతోడ

గీ॥ శోకమునమున్గిదేవి య ♦ శోకవనము
నందునున్నది లంకలో ♦ నందమెడలి
సేమమును దెల్పి యుంగ్రము ♦ చేతికియ్య
జనని!తలమానికము నిచ్చెఁ ♦ గొనుమురామ!.

లంకే ట్లున్నదని శ్రీరాముఁడడుగఁగా హనుమంతుఁడు:—

సీ॥ ఇరువంకనొకతీరు ♦ వరసౌధములమీఁదు
విస్తారవీధికా ♦ నిస్తులంబు
వివిధపుష్పోద్యాన ♦ వేణువీణాగాన
విద్యుత్ప్రదీపికా ♦ విలసితంబు
చతురంగసైనిక ♦ సంచారభూమిక
మల్లకేళీరంగ ♦ మండితంబు
బహుళయంత్రోపేత ♦ ప్రాకారపరివృత
పటుదుర్గశోభిత ♦ ప్రాభవంబు

గీ॥ మాంసభోజన పరసతీ ♦ మానహరణ
మద్యపానాది పాప స ♦ మ్మాసితంబు
రాక్షసేశ్వరదోర్దండ ♦ రక్షితంబు
పాపులకుఁగాపురంబు లం ♦ కాపురంబు.

(సముద్రప్రాంతము.)
రాముని శిబిరము.

విభీషణుఁడు:—

కమాచ్ — రూపకము.

శరణుదశరథరామ! సద్గుణధామ! శరణుదశరథరామ!
శరణాగతత్రాణబిరుదు - నీదనివిని - శరణమునేఁజొచ్చితి
కరముశిరమునువంచినీదగు - చరణములనేశరణువేఁడితి. ॥శర॥

సుగ్రీవుఁడు శ్రీరామునితో:—

చ॥ ఇతఁడువిభీషణుండుదనుజేంద్రునితమ్ముఁడునమ్మి పాపవి
రితనికినిచ్చినట్టి మనకు ♦ నెవ్వగనొవ్వగ నౌనుగానసా
మతమునసీతనిట్టిదయకు ♦ మాన్యునిఁజేయుట మేలుగాదు స
ద్గతమతినెంచిచూడుఁడసు ♦ రేంద్రునిమాయలమేయముల్ ప్రభూ

శ్రీరాముఁడు:—

ఉ॥ తమ్ముఁడె కాదు రావణుఁడు ♦ దాశరణంబనివచ్చి వేడినన్
నెమ్మదిఁగాచెదన్ విడువ ♦ నేరములెంచ విభీషణున్ వడిన్

దెమ్మకరమ్మగౌరవము ♦ తేటపడ న్గనుఁగొమ్మ పొమ్మనా
తమ్మునిఁబోలెఁజూచెద ను ♦ దారతఁబర్వతలోకనాయకా!

విభీషణుఁడు:—

కమాచ్ — రూపకము.

శరణుదశరథరామ! సద్గుణధామ! శరణుదశరథరామ!
పరసతిఁగోరుట - పాపమంచని తెల్పఁ - బురము వెడలనడచెను
దురితపరుఁడా రావణాసురుఁ - డరయు నే భవదీయ శౌర్యము॥ శర॥
అని శ్రీరాముని చరణములమీఁదఁ బడుచు:—

శ్రీరాముఁడు:—

ఉ॥ లెమ్మువిభీషణా! భయము ♦ లేదిఁకనీకభయమ్మొసంగితిన్
జిమ్మెద వైరిగుండె ల ♦ భిషిక్తునిఁజేసెద నిన్నులంకకున్
నమ్మము రావణాసురుఁడు ♦ నాశరణంబొకవేళఁజొచ్చినన్
సమ్మతినిన్న యోధ్యకు ని ♦ జంబుగఁబట్టముఁగట్టి కాచెదన్.

(లంక రావణుని యంతఃపురము.)

మండోదరి రావణునితో:—

కమాచ్ — రూపకము.

పరనారీసంపర్కము - పరమదురితము - పరనారీసంపర్కము
దరిలేనిదుఃఖము - దొరకొనఁజేయును ॥ పర ॥
సిరులఁదొలంచును - జిరకీర్తి మాపును - పరమశూరుని కైనఁ
బరిభవ మొనరించు ॥ పర ॥

చరణములనుబడి - స్వామి!నిన్వేడెదఁ
వరళాక్షిసీతను - దాశరథికినిమ్మి ॥ పర ॥

రావణుఁడు:—

క॥ దశజనబాహుబలమ్మును
దశజనధీబలముగలిగి ♦ దశకంఠుఁడనన్
దశదిశలఁ బేరుపొందితి
శశిముఖ! వెఱవేలనాకు ♦ శత్రుండెదురే

అని మేడపైకిఁదీసికొనిపోయి:—

శా॥ సౌధాగ్రమ్ముననుండిచూడుముసతీ! ♦ సంగ్రామరంగంబునన్
యోధాగ్రేసరులెల్లఁగూడిరదిగో ♦ యుత్సాహముప్పొంగఁగాఁ
గ్రోధోద్దీపితమానసంబులభటుల్ ♦ ఘోషిల్లుచున్నారదే
యోధాళిందళవాయియుద్ధమునకై ♦ యూకొల్పెఁదూర్యధ్వనిన్.

ఉ॥ హాసతి! బాణవేగమదె ♦ యక్కట! యోర్వకనాదుసైనికుల్
రాసులురాసులై పుడమి ♦ రాలఁగఁజొచ్చిరిదేమిచోద్యమో

మేఘనాదునిఁజూచి:—

ఓసుత! మేఘనాద! కడు ♦ యుక్తులనేర్చిననీకెచెల్లుఁగా
వాసిగరామునిందునిమి ♦ వారకసీతనునాకుఁగూర్పఁగాన్.

మేఘనాదుఁడు:—

కమాచ్—రూపకము

పరనారీసంపర్కము - పరమదురితము - పరనారీసంపర్కము.

రావణుఁడు:—

క॥ కదనముఁజూచి భయంపడి
యిదియొకనెపమెన్నిపలుకు ♦ దేనీచాత్మా!
యెదురాడకు నాముందట
వదరిననీశిరముఁద్రుంచి ♦ వైచెదనిదిగో.

(రణరంగము.)

విభీషణుఁడు లక్ష్మణునితో:—

చ॥ అదెయదెవచ్చెరావణుని ♦ యగ్రకుమారుఁడుచూడుచూడుమా]
పదపదలక్ష్మణా!కదిసి ♦ ఫాలమునంటఁగబాణమేయుమా
అదెవడివాడిబాణమదె ♦ యక్కటవచ్చెనుగొట్టుకొట్టుమా
యిదెపడెలక్ష్మణుండహహా♦ యేమిఘటిల్లఁగనున్నదోకటా!

(శ్రీరాముఁడు పడిన లక్ష్మణునిఁజూచి:—)

నాథనామక్రియ—రూపకము.

అకటా!లక్ష్మణ!పడితే-ఆలములోపల నీవు
ఇఁకయుద్ధము నాకేలను-ఇంతటితోఁజాలింతును ॥అకటా॥
అడవులలోనాతోఁబడి-ఇడుములకన్నిటికోర్చి
విడనాడక మెలఁగితివే - పుడమిని నీకీడుగలఁడే ॥ అకటా ॥

జాంబవంతుఁడు:—

గీ॥ నాడియాడుచున్నది ♦ వేఁడికలదు
భయపడకురామ! మూర్ఛలై ♦ భయముపడకు
దూరమునఁగాంచవచ్చెడి ♦ ద్రోణగిరిని
వెలయుసంజీవిఁగొనిరాఁగ ♦ వేగనరిగె
వాయుపుత్రుండుస్వామి సే ♦ వాపరుండు॥

(శ్రీరాముఁడు లక్ష్మణునిఁజూచి కంటఁదడిపెట్టుకొని)

క॥ జననీజనకులకంటెను
దనకులసతికంటెఁబ్రాణ ♦ ధనములకంటెన్
ఘనముగ నన్ననుతమ్ముఁడు
రణమునఁబడెరమణియేల ♦ రాజ్యమదేలా?

జాంబవంతుఁడు:—

ఆ॥ ఆంజనేయుఁడదిగో ♦ సంజీవిఁగొనివచ్చె
దేవ! చూడు దీని ♦ దివ్యమహిమ
మెల్లమెల్లగాను ♦ మేల్కొనిసౌమిత్రి
రమ్యసుగుణసాంద్ర! రాఘవేంద్ర!

(శ్రీరాముఁడుఆంజనేయునితో)

గీ॥ చెలిమి సుగ్రీవుతోనాకుఁ ♦ గొలిపినావు
దేవిఁగనివచ్చి నాకోర్కెఁ ♦ దీర్చినావు

తెచ్చిసంజీవినాతమ్ము ♦ నిచ్చినావు
ఔనె నీసేవనుతిసేయ ♦ నాంజనేయ !

(అందరును సంతోషముతో)
శంకరాభరణము—రూపకము

రామ !రాజభూషణా !రాక్షసకులభీషణా !
సామమధురభాషణ !సాధుతాపశోషణా !

మేఘనాదుఁడు:—

చ॥ ఇదెయిదెసీతదాశిరముసే ♦ దెగఁద్రుంచితిఁజూడుఁడీముదం
బొదవఁగనాదుతండ్రికిని ♦ యుద్ధములోపల మీశిరంబులన్
జెదరఁగఁజేసెదన్ వినుఁడు ♦ చేతను బాణములుంచిరండు నన్నెదిరిసు రేంద్రుడేమియగు ♦నేర్పడఁజూడుఁడుమత్ప్రతాపమున్

(సీతశిరముఁజూచి శరమును జార్చుచున్న లక్ష్మణునితో విభీషణుఁడు)

చ॥ అదెయదెమాయఁజేసెనది ♦ యాజనకాత్మజమస్తకంబుగా
దది యొకవాడిబాణముచ ♦ నా చెడుకక్కసుఁద్రుంచులక్ష్మణా!
(లా)అదెబలుఁగొట్టితో నసుర ♦ నాదటడొక్కలుచీలునట్లుగా
నెదమరిభేదిలన్ శిరము ♦ దేగితటుక్కునభూమిడొల్లఁగాన్.

(అందరు మేఘనాదుఁడు పడుటకుసంతోషించి)

శంకరాభరణము—రూపకము

రామ! రాజభూషణ! రాక్షసకులభీషణా!
సామమధురభాషణా! సాధుతాపశోషణా॥ ॥రామ॥

(కుంభకర్ణుని భవనము)

(తాగుచుబోతగు కుంభకర్ణుని సమీపించి, రావణుడు.)

ఉ॥ తమ్ముడ! కుంభకర్ణ! నినుఁ ♦ దప్పమరెవ్వరులేరునాకు నీ
వెమ్మెయిఁబోయి దాశరథి ♦ నెట్లయినన్ వడిఁజంపి రాగదే
నమ్మిన నాకు సమ్మదమొ ♦ నర్పుము హెమ్మ జయమ్ముఁ
[గొమ్మనా
తమ్ముఁడవైన నీకతనఁ ♦ దప్పక సీతను బొంది పొంగెదన్.

కుంభకర్ణుడు:—

కమాచ్—రూపకము

పరనారీసంపర్కము-పరమదురితము-పరనారీసంపర్కము

(అని ప్రారంభింపఁగా వానికి దాగుడునిచ్చి రణమునకుఁ బం
పి రావణుఁడు వెళ్ళిపోవును)

(రావణుఁడు సీతనుసమీపించి)

క॥ రాముతలఁజూడు సీతా!
యేమంటివి నాఁడునన్ను ♦ నెవ్వఁడుపోరుం
డీమారు మాటపలుకకు
కామితమును దీర్పవలయుఁ ♦ గాంతామణిరో!

(సీత శ్రీరాముని తలఁజూచి)

ఆనందభైరవి—రూపకము.

హా రామ! నాప్రాణధామ! నీవీరీతి నాకొఱకు వైరిచేఁ దెగితే॥ హా

రావణుఁడు:—

క॥ రామా రామా యనకిఁక
నీమగనిం బోలె నిన్ను ♦ నేనీకత్తిన్
నీమస్తకమ్ముఁ దునిమెదఁ
గామితమును దీర్పకున్నఁ ♦ గార్పణ్యవతీ!

త్రిజట:—

క॥ నారిన్ జంపుట యుక్తమె
యోరావణ! నేఁడు రేపు ♦ నోపికపట్టన్
నేరెవె ఘోరము లేటికిఁ
దీరున్నీ కోర్కెలెల్లఁ ♦ దీవ్రముగానే.

అని రావణునిఁ బంపివేయును:—

సీత:—   ఆనందభైరవి — రూపకము.

దారి యేమిఁక నాకు రామా! నాశరీరము విడచెద నో రఘురామా!

త్రిజట:—   ఆనందభైరవి — రూపకము.

సీతమ్మా విచవే నాతల్లీ-నీపతి-ఘాతము సేయఁగ-నీతని తరమే॥ సీత
ఈతల రామునిది కాదు-నీవు-భీతిల్ల మోసము-నీతఁడు చేసె॥ ఈతల

సీత:—

క॥ రామా! సుజనారామా!
రామా! నాప్రాణధామ! రవికులసోమా!
రామా! రాజలలామా!
రామా! సుగుణాభిరామ! రామా! రామా!

(రణరంగము.)

విభీషణుఁడు శ్రీరామునిఁజూచి:—

ఉ॥ వచ్చెనుగుంభకర్ణుఁడు ది ♦ వాకరవంశపయోధిచంద్రమా!
చెచ్చెరనొక్కబాణమునఁ♦జిమ్ముము వీనిశిరమ్ము డొల్లఁగా
(రాఁ)అచ్చెరువయ్యె నోరఘువ♦రా!యదె వైరిశిరమ్ముమీఁదికిన్
హెచ్చుగఁబోయెదిర్దికిగి ♦ యెచ్చటనోపడిపోయెఁజూచితే.

అందఱు:—

రామ!రాజభూషణ! - రాక్షసకులభీషణ! - సామమధురభాషణ! -
సాధుతాపశోషణా!

(రావణుని యంతఃపురము.)

మండోదరి రావణునితో:—

ఉ॥ పావనమౌపులస్త్యముని ♦ వంశమునన్ జనియించినారు సం
భావితశౌర్యధైర్యమహి ♦ మన్ బలువాసినిగాంచినారు నా
నావిధవిద్యలన్ దెలిసి ♦ నారుపరాంగనఁగోరిమానమున్
జీవముఁగోలుపోఁదగునె ♦ సీతనురామునికీక నాయకా!

రావణుఁడు:—

ఉ॥ కామినీ!యందఱన్ మడియఁ ♦ గాంచితినీతు లవేలనాకునో
తామరసాక్షి!కుందకుము ♦ దాశరథిన్ మఱివానివారలన్
నామిడిపోనిబాణముల ♦ నాపరువొప్పగఁద్రుంచివై చెదన్
గోమల సీతతోఁగలిసి ♦ కూరిమితోడుతలంకనేలెదన్.

(రణరంగము.)

విభీషణుఁడు శ్రీరామునితో:—

ఉ॥ వచ్చెనురావణాసురుఁడు♦వానినిద్రుంచుటసాధ్యమో ప్రభూ!
చిచ్చగనంటునంటజను ♦ జెచ్చెరఁజంపకజాగుచేసినన్
(తాఁ)హెచ్చుత్వదీయశౌర్యమున♦కెవ్వరుసాటిజగంబునందహో
అచ్చెరువయ్యెవైరివగు ♦ నశ్వరథంబులుగూలెనొక్కటన్

చ॥ సరసరకత్తి మూసిమన సైనికులన్ ♦ దెగటార్పసాగెనో
సరసిజమిత్రవంశమణి! ♦ చాపము నెక్కిడునీచుశత్రుడా
శిరముఁకలుక్కునన్ దఱుగు♦నేమముగాదెడసేయనో ప్రభూ!
(తాఁ)తిరమెనుతింపవైరియడి ♦ దంబదెనుగ్గయిరాలెనేలపై.

శ్రీరాముఁడు రావణుని సమీపించి:—

ఉ॥ లేదుశరంబు లేదువిలు ♦ లేదడిదంబును జేరుసైనికుల్
మీఁదనికేమినీకుగతి ♦ మేలగునాసతి సీతనిమ్ము ని
న్నాదరదృష్టిఁజూచెదభ♦యంపడఁబోకుముపొమ్ము రావణా!
నాదగుపల్కుమీఱినను ♦ నాశముచేసెద తే పెచూడుమా

(రావణుని యంతఃపురము.)

మండోదరి రావణునితో:—

హరికాంభోజి — రూపకము.

కరుణానిధియాదాశరథి - కల్యాణగుణనీరధి
కరుణానిధి యాదాశరథి
తరుణిసీతనిచ్చి - చరణములబడి
శరణము వేఁడిన - సరగునఁబోచుచును. ॥ కరుణా ॥

రావణుఁడు:—

క॥ చొచ్చెదనే శరణంబును
జచ్చెదఁగాకొండవైరిఁ ♦ జంపెదనొండేఁ
ముచ్చటదీరక జానకి
నిచ్చెదనే ప్రాణమైన ♦ నిచ్చెదఁదరుణీ!

ఉ॥ ఈపరిరామునింబొగడి ♦ యేడ్తుఅనాదుశరాగ్నికీలలం
దోషికవాణి!యావహుతిగ ♦ నొక్కటఁబ్రేల్చిమదీయశౌర్యముఁ
జూపెదఁజాటియెల్లరకు ♦ సుందరిసీతను గూడిపొంగెదఁ
నాపరివారముఁబ్రజలు ♦ నాప్రియురాలగునీవుసుబ్బఁగాఁ.

(రణరంగము.)

విభీషణుఁడు శ్రీరామునితో:—

చ॥ అదెమఱివచ్చె రావణుఁడ ♦ హంకృతిఁదీక్ష్ణ శరాళిసేనలఁ
జెదరఁగఁజేసె వైరితలఁ ♦ జిమ్ముముచూచెదవేమి? రాఘవా!

(శా॥)అజెదిరదిర్దిరందిరిగి ♦ యంబరవీధిని బోయిపోయి య
ల్లదిగో లేటూలుపట్టబడియె ♦ నారిపుమస్తకముర్విపై(బ్రభూ!

అందఱు:—

రామ!రాజభూషణ! రాక్షసకులభీషణ! సామమధురభాషణ!
సాధుతాపశోషణా!

మండోదరి:—

నాథనామక్రియ — రూపకము.

హావిభు!నను(బాసితే - అకట! చింత(ద్రోసితే
భూవిభుశ్రీరామచంద్రు- దేవినిచ్చిశరణువేడి- చావకజీవింపుమన్న
చలముపట్టిగిట్టితే ॥ హావి ॥
పరులస్త్రీల(గోరువారి - పాటిదేయంచు(జాటి - దురితపరా!
ప్రాణనాథ! దూరమయిపోయితే ॥ హావి ॥

శ్రీరాముడు విభీషణునితో:—

గీ॥ అలుకమానివిభీషణా! ♦ యగ్రజునకు
నుత్తరక్రియలొనరించి ♦ యుచితరీతి
నూరడింపుము దుఃఖించు ♦ చుండునీదు
వదినెగారిని సాధ్వియై ♦ పరగుదాని.

ఋషులు శ్రీరాముని సమీపించి:—

గీ॥ కంటకుండగు నాదశ ♦ కంఠు(డునిమి
భద్రమును గూర్చితివి మాకు(♦ పార్థివేంద్ర!

ప్రాగడఁ దరమౌనె నిన్ను నో ♦ సుగుణసాంద్ర!
రమ్యరవికులకలశవా ♦ రాశిచంద్ర!

శ్రీరాముఁడు:—

గీ॥ చెలఁగుమీరొదగు దీవెన ♦ బలిమిఁగాక
నాబలముచేత వైరిని ♦ నాశపఱుపఁ
జాలుదునె నన్ను నగ్గింప ♦ నేలమీకుఁ
బుణ్యధనులార! మానివ ♦ రేణ్యులార!

శ్రీరాముఁడు విభీషణునితో:—

శా॥ లంకాద్వీపము నేలుమింకఁ గరుణా ♦ లంకార! శాంతాత్మ! ని
శ్శంకన్నీవు విభీషణా! నినుజనుల్ ♦ శ్లాఘింపఁగా నేర్పుతోఁ
గైంకర్యమ్మున లేరు నీసములు పెన్ ♦ గంటిన్ దగన్ ఱెప్పవే
వంకన్ గా చెడునట్లు గాచితి కదే ♦ వారించితి కష్టంబులన్.

(శ్రీరాముని శిబిరము.)

శ్రీరామచంద్రుఁడు వృక్షముక్రిందఁ గూర్చుండియుండఁగా అందఱును జయోత్సవమునుజేయుచుండిరి. ఋషులు హోమములొనర్చుచుండిరి. ప్రజలుదీపోత్సవముఁ జేయుచుండిరి. బాలురు పలు తెఱంగుల బాణములనుగాల్చుచుండిరి. విభీషణుఁడు సీతాదేవిని పైఁడియందలములోఁ దెచ్చి నిలిపెను. సీతకున్ను శ్రీరామునికినినవుమ నీయగ్నిసంబంధమైన వేడుకలన్నియు జరుగుచుండెను

ఎంతో కాలము మీఁదఁ దనప్రాణనాథుఁడగు శ్రీరామచంద్రునిఁ జూచినయా సీతామహాదేవికిని వేడుకలొక్కటియుఁ గానరాలేదు. ఆమె లత్యంతయు శ్రీరామునియందే లగ్నమై యుండెను. కాన నాయగ్నిలోనుండి మెఱుపువలె వచ్చి శ్రీరామచంద్రుని పాదారవిందముల కెరగెను.

ఈదృశ్యమును జూచుచున్న వారందఱు:—

గీ॥ అగ్ని తెజదాఁటి యీాజన ♦ కాత్మజాత
పరమపూతపతివ్రత ♦ పాపరహిత
మెఱుపువలె వచ్చిరాముని ♦ కెరగెనదిగో
యహహా! యెంతటిగరితయో ♦ యమలచరిత.

అని కొనియాడుచుండిరి:—

సీత:— హంసధ్వని — రూపకము.

కంటిమీాపదకంజముల నుదు - రంట మ్రొక్కితిని
కంటకునిదశకంఠుఁదునిమినా
తొంటిపుణ్యములనెల్లఁ - బంటపండఁజేసితిరి. ॥ కంటి ॥

శ్రీరాముఁడు:—

లెమ్మసీత! కరమ్ము సంతో - షమ్ముఁ బొందితిని
రమ్మనీదు కరమ్ముఁ దెమ్మిట
నమ్మలికమెల్లఁ దీరె - నెమ్మదిగనుండుమింక. ॥ లెమ్మ ॥

సీత:— ఈత్రిజటనామిత్రమో ప్రభు! శత్రులిందఱిలో
చిత్రవధరిపు చేసియుండఁడె
చిత్రమీపవిత్రచరిత - చెంతమాత్రలేకయున్న. ॥ఈత్రి॥

శ్రీరాముఁడు:—
సీత! వీరిన - మేతముగ సాకేతపురికేగి
ప్రీతిరత్నాన్వితములనొగి
చేతులారనిమ్మనీకుఁ - జేతికడ్డమేదిలేదు ॥సీత॥

(అయోధ్య.)

ముందేవంపఁబడిన యాంజనేయుఁడు భరతునితో:—

శంకరాభరణము — రూపకము.

అదిగో శ్రీరామచంద్రుఁ - డరుదెంచెనుజూడు భరత!
కదలివచ్చుసూర్యపగిదిఁ - గానఁబడెవిమానమదిగో ॥ అది ॥
దనుజపతియు వనచరపతి - తనతమ్ముఁడు భక్తిఁగొలువ
జనకరాజతనయఁగూడి - చనుదెంచెను రామవిభుఁడు ॥ అది ॥
ధరకుదిగెవిమానమదిగో - తరలివచ్చెరాముఁడదిగో
భరతా! వేవేగరమ్మ - ధాత్రీవరునిసేవింపుము. ॥ అది ॥

భరతుఁడు:—
గీ॥ చెచ్చెరనురామ! పట్టాభి ♦ షిక్తుఁడవయి
శిరము పైనున్న యోర్వని ♦ బరువుడించి
నన్ను! ధన్యునిగాఁ జేయు ♦ మన్న! నేఁడె
యెల్లజనములయుల్లముల్ ♦ పల్లవింప.

శ్రీరామచంద్రుఁడు తల్లులకెల్లరకును మ్రొక్కి విన్ననైనమొగ మ్ముతోఁ గన్నీరుగార్చుచు నొకమూలయందొదిగియున్నకైకను సమీపించి యత్యంతవినయముతో:—

గీ॥ తండ్రికుండెడు ప్రేమను ♦ దమ్ములకును
నుండు ప్రేమను మిత్రుల ♦ కుండు ప్రేమ
భార్యకుండెడు ప్రేమ సే ♦ వకుల ప్రేమ
యిన్ని ప్రేమల నీకృప ♦ నెఱుఁగఁగంటిఁ
జింతిలకుమమ్మ దీవించి ♦ చెలఁగుమమ్మ!

అని నమస్కరించెను:—

(అయోధ్య సభాభవనము.)

(శ్రీరామ పట్టాభిషేకము.)

సీ॥ శత్రుఘ్నలక్ష్మణుల్ ♦ సరినిరువంకల
వింజామరమ్ముల ♦ విసరుచుండ
వెనుకనునిలఁబడి ♦ విమలాతపత్రంబు
భరతుండు వేడ్కతోఁ ♦ బట్టుచుండఁ
బదములకడఁజేరి ♦ పవనతనూజుండు
గురుతరభక్తితోఁ ♦ గొలుచుచుండ
దనుజులు వనచరుల్ ♦ దమతమపతులతోఁ
గుసుమవర్షమ్ములు ♦ గురియుచుండ

గీ॥ మునులయాశీరవమ్ములు ♦ పొదలుచుండఁ
బ్రజలజయజయనాదముల్ ♦ పర్వుచుండ

భూరిమంగళవాద్యముల్ ♦ మ్రోయుచుండ
భవ్యచిత్రమహాసభా ♦ భవనమందు
రత్నసింహాసనంబున ♦ రమణిఁగూడి
మస్తకంబునమణిమయ ♦ మకుటమొప్పఁ
జెలువుమీఱఁగఁ బట్టాభి ♦ షిక్తుఁడయ్యె
సర్వనుతకీర్తి శ్రీరామ ♦ చంద్రమూర్తి.

గీ॥ సవితృవంశాబ్ధిసంపూర్ణ ♦ చంద్రుఁడైన
రామచంద్రుండురాజ్యభా ♦ రమువహింప
సృష్టియంతయుఁబుష్టియుం ♦ దుష్టిఁబొందె
శిష్టులందఱుపరమప్ర ♦ హృష్టులైరి.

సీ॥ సుగ్రీవుపేరిట ♦ సురుచిరమయినట్టి
విశ్వకళాశాల ♦ వెలయఁజేసె
నావిభీషణుపేర ♦ నతివిచిత్రవిశాల
విమలసరోవరం ♦ బమరఁజేసె
జాంబవంతునిపేర ♦ జనవిహారోచిత
ప్రమదావనంబును ♦ బరఁగఁజేసె
తననికేతనముపైఁ ♦ దనరుకేతనముపై
నాంజనేయాకృతి ♦ నలరఁజేసె

గీ॥ దీనశరణాలయంబును ♦ త్రిజటపేరఁ
గ్రాలఁగాఁజేసియనదల ♦ గాసిఁదీర్చెఁ
గోరుకోరికెలన్నియుఁ ♦ గూర్మినొసఁగి

దనుజవనచరవర్గముఁ ♦ దనియఁజేసె
సర్వనుతకీర్తి శ్రీరామ ♦ చంద్రమూర్తి.

క॥ రాముని వలెనే నీవును
సోమేశ్వరభూప! సకల ♦ సుఖములనిడుచున్
బ్రేమన్ రాజ్యం బేలుము
భూమీశులు ప్రజలు కవులు ♦ బుధులు నుతింపన్

క॥ నీపుత్రమణికి నీకున్
నీపత్నీరత్నమునకు ♦ నీబంధులకున్
నీపరిచరులకుఁ బ్రజలకు
నాప్రభువరుఁ డిచ్చుఁగాత ♦ సఖిలశుభంబుల్.

ఇది, శ్రీపరమేశ్వర కరుణాఫలిత లలితకవితాక
లిత శ్రీరామలక్ష్మాంబా బుచ్చివేంకయా
మాత్య పుత్ర సకలసజ్జనవిధేయ
ఆనపూడి సోమనాథ నామ
ధేయ ప్రణీతంబయిన,
శ్రీ ర మ ణీ య రా మా య ణ ము
సంపూర్ణము.

==♦o♦==

Printed a[illegible] e Lakshmi Press Gadwal.

Copies can be had of :—

A. SOMANATHA RAO,

15, Muthukrishna Mudali St,

Mylapore,

Price | As. 2 MADRAS.